క్లుప్తంగా

చందన నాగేశ్వర్‌కు సత్కారం



చందన నాగేశ్వర్‌ను సత్కరిస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

కడియం: రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను కడియం ఎంపీడీవో కె.రత్న కుమారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో చందనను కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వీవీఎస్ఎస్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, శిరీష, విజయరాజు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు, లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు సోమవారం తెలిపారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఈ నెల 18 నుంచి కంప్యూటర్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్నవారు అర్హులన్నారు. 45 రోజులు జరిగే శిక్షణలో ఉచితంగా మెటీరియల్‌తో పాటు శిక్షణానంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి కలవారు 81256 86494 నంబర్‌ను లేదా స్వర్ణాంధ్ర సేవాసంస్థలో స్వయంగా సంప్రదించాలన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



నాగబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ఏపీ గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సోమవారం మురమండ గ్రామానికి చెందిన పలువురిని పరామర్శించారు. గ్రామానికి చెందిన నాగబాబు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న వట్టికూటి జానకిరామయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జిల్లా చేనేత సహకార సంఘాల అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ దీనదయాళ్, సావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, పార్టీ నాయకులు సాపిరెడ్డి కామేష్, వెంపాటి గంగారావు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక పద్మావతి ఘాట్ సమీపంలోని టూరిజం కార్యాలయం వెనుక గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఒకటో పట్టణ పోలీసులు సోమవారం కనుగొన్నారు. సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు వయసు గల వ్యక్తి మృతదేహం నదిలో తేలియాడడం చూసిన టూరిజం కంట్రోల్ రూమ్ సీనియర్ అసిస్టెంట్ విశ్వనాథశాస్త్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని మైదానంలో క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఆదివారం ఫైనల్స్ నిర్వహించనున్నట్టు పోటీల నిర్వాహకులు ఏడిద పండు, పిల్లి క్రాంతి తెలిపారు. ఈ పోటీల్లో విజేతకు రూ.25 వేలు, రన్నర్‌కు రూ.15 వేలు అందించనున్నారు.

మగ్గం వర్కులో మహిళలకు శిక్షణ

రాజానగరం: దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా ఎంపిక చేసిన పేదింటి మహిళలకు మగ్గం వర్కులో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బిక్కవోలు మండలం కాపవరంలో సోమవారం ప్రారంభించామని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనపర్తికి చెందిన షేక్ ఆయిషా శిక్షకురాలిగా వ్యవహరిస్తున్నారన్నారు. మొదటి రోజు 80 మంది మహిళలు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుంకర నాగేశ్వరరావు, సుంకర వీరాస్వామి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

పాఠశాల గ్రంథాలయం.. చదువుకు ప్రోత్సాహం

- నాగరాజా పాఠశాలలో ఏర్పాటు
- అందుబాటులో 575 పుస్తకాలు



నాగరాజా మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన తరగతి గది లైబ్రరీ

కంబాలచెరువు: సాధారణంగా గ్రంథాలయాన్ని పెద్ద తరగతులతో పాటు ఇంటర్, డిగ్రీ, ఆపై విద్యాలయాల్లోనే చూస్తాం. అయితే రాజమహేంద్రవరంలోని నాగరాజా మున్సిపల్ ప్రైమరీ స్కూలులో చిన్నారులకు లైబ్రరీ ఏర్పాటైంది. విద్యకు అధిక ప్రాధానమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో సకల సౌకర్యాలు సమకూర్చుతోంది. పిల్లల చదువుకు అన్ని వనరులు సమకూర్చుతోంది. దీనికి ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల సహాయం తోడైతే విద్యాలయాలు మరింత పురోగతి చెందుతాయి. ఈ విధానం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించేలా దాతల సహాయం కోరుతున్నారు.

విలువైన పుస్తకాలు

నాగరాజా మున్సిపల్ పాఠశాలలో తరగతి గది లైబ్రరీని పీజీఎస్ఎస్ఎఫ్, లెర్న్ అండ్ హెల్ప్ సహకారంతో డాక్టర్ జాస్తి శివ రామకృష్ణ ప్రారంభించారు. సుమారు రూ.40 వేలు విలువైన 575 పుస్తకాలను పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం ఒకటి నుంచి ఐదు తరగతుల వరకూ 221 మంది చదువుతున్నారు. వీరందరికీ లైబ్రరీ అంటే ఏమిటి, అందులో ఏమి లభిస్తాయి, లైబ్రరీ వల్ల ఉపయోగాలు ఏమిటి వంటి విషయాలపై ముందుగానే అవగాహన కల్పించారు.

చదువుపై ఆసక్తి

ప్రాథమిక స్థాయి నుంచీ చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. దీంతో నాగరాజా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లైబ్రరీలో విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను ఉత్సాహంగా చదువుతున్నారు. ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణి ప్రత్యేక శ్రద్ధతో, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. దీనికి పాఠశాల విద్యా కమిటీ అదే రీతిలో వారికి ప్రోత్సాహానిస్తున్నారు.

ఆహ్లాదం

ప్రకాశం గ్లోబల్ ఎన్ఆర్ఐ ఫోరం ద్వారా పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు సరఫరా అవుతున్నాయి. నిత్యం పాఠ్య పుస్తకాలతో గడిపే విద్యార్థులకు తరగతి లైబ్రరీ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టేలా జనరల్ నాలెడ్జ్, నీతి కథలు, చరిత్ర, బొమ్మల కథలు, అంకెల్లో సరదాలు, గణితంలో గమ్మత్తులు తదితర పుస్తకాలు తరగతి గదిలో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆయా తరగతి స్థాయిని బట్టి అందుబాటులో ఉంచారు.

ప్రణాళిక ప్రకారం



చదువుతో పాటు పాఠశాలలో అందుబాటులో ఉన్న లైబ్రరీని విద్యార్థులందరూ ఉపయోగించుకునేలా ప్రణాళిక రూపొందించాం. వారికి నచ్చిన అంశంలో, నచ్చిన పుస్తకాన్ని తీసుకుని, వాటిలోని విషయాలను అవగాహన చేసుకునేలా చూస్తున్నాం. ప్రస్తుతం దాదాపు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాం.

– మోటూరి మంగారాణి,
హెచ్ఎం, నాగరాజా మున్సిపల్ పాఠశాల

డీవార్మింగ్ డేని విజయవంతం చేయాలి



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి స్కూల్‌కు డీవార్మింగ్ మాత్రలు అందాయో, లేదో సంబంధిత ప్రధానోపాధ్యాయులతో సరిచూసుకోవాలని అధికారులకు నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి స్కూల్‌కు వెళ్లి ఆయా తరగతి పిల్లలతో ఫొటో తీసుకుని పంపాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను ఆరోగ్య కార్యదర్శులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి 100 శాతం డీవార్మింగ్ మాత్రలు పంపిణీ పూర్తి చేయాలన్నారు.

వందశాతం పన్ను వసూలు

కమిషనర్ మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో రూ.20 లక్షల ఇంటింటి చెత్త సేకరణ పన్ను వసూలు చేయాలన్నారు. గురువారం వార్డుల వారీగా పన్ను వసూలు ప్రగతిని సమీక్ష చేస్తానన్నారు. గతవారం నిర్దేశించిన లక్ష్యాల్లో రూ.7 లక్షల వరకు మాత్రమే వసూలు సాధించారన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఫేజ్ 2 కింద మొత్తం 4,534 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, ఇంకా 725 మందికి పట్టాల పంపిణీ చేయాల్సి ఉందన్నారు. రాబోయే రెండు రోజుల్లో వాటిని అందజేయాలని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో కనీసం ఒక సమస్య గుర్తించి, వాటి వివరాలు అప్లోడ్ చేసి, వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించినా, ఆ మేరకు లక్ష్యాలను సాధించడం జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమేనిటీస్ సెక్రెటరీ (సౌకర్యాల కల్పన కార్యదర్శులు), ఆరోగ్య కార్యదర్శులు సమన్వయం సాధించడం ద్వారా సమస్యలు గుర్తించాల్సి ఉంటుందన్నారు. స్పందన కార్యక్రమంలో 24 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి, ముఖ్య పట్టణ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



మురమండలో బాధితులకు సాయం అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: మురమండలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) సోమవారం సాయం అందించారు. చింతాలమ్మ పుంతరోడ్డులోని పండూరి అప్పారావు, దేవుడమ్మకు చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. ఈ నేపథ్యంలో బాధితులకు బాబు వంటపాత్రలు, బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు, దుస్తులు తదితర వస్తువులను అందజేశారు. వార్డు సభ్యుడు వై.వీరబాబు బాధిత కుటుంబానికి నగదు సాయం చేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత సహకార సంఘాల అధ్యక్షుడు యర్రా సూర్యనారాయణ, స్థానిక నాయకులు మెల్లిమి గంగరాజు, గన్ని పెదబాబీ, కొప్పాక రమణ, అయినవిల్లి ప్రసాద్, కోటిపల్లి లక్ష్మణరావు, బోగాల మాధవరెడ్డి, మజ్జి కన్నమ నాయుడు, యేలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని సుబ్బయమ్మపేటలో నివాసం ఉంటున్న సిద్దనాటి బాపనమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల కాలిపోయింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) సోమవారం బాధితులను పరామర్శించారు. ఆ కుటుంబాలకు సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులు, బియ్యం, దుప్పట్లు, చీరలు, వంట సామగ్రి, నగదును స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌వీ శేఖర్, తలారి వరప్రసాద్, షట్టర్ బాషా, దేవులపల్లి సరితారాణి, గొన్నా సత్తిబాబు, వాటాడ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు.

వైభవంగా మొల్లమాంబ జయంత్యుత్సవం



మొల్లమాంబ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాజ్‌కుమార్ వుడయార్

సీటీఆర్ఐ: మొల్లమాంబ భక్తి అనితర సాధ్యమైనదని కవయిత్రి మొల్ల సాహిత్య ప్రచార సమితి అధ్యక్షుడు మున్నెల్లి శివ శంకరయ్య అన్నారు. స్థానిక గౌతమి ఘాట్ వద్ద మొల్లమాంబ జయంతి మహోత్సవ వేడుకలను గౌతమి ఘాట్, వాకర్స్, యోగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారత్న ఆచార్య దేవగుప్తాపు రాజకుమార్ వుడయార్ మాట్లాడుతూ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని తేటతెలుగులో కందపద్యాలతో మొల్లమాంబ రచించడం జరిగిందన్నారు. అందుకే మొల్ల రామాయణాన్ని కంద రామాయణం అని కూడా అంటారన్నారు. మొల్ల ఏవిధమైన సంప్రదాయ విద్యను అభ్యసించలేదన్నారు. తన సహజ పాండిత్యానికి భగవంతుడే కారణమని చాలాసార్లు చెప్పిందన్నారు. మొల్లమాంబ పేరుతో సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో ఇకపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆమె పేరుతో కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. అనంతరం కూచిపూడి కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు విశిష్ట వ్యక్తులకు మొల్లమాంబ విశిష్ట వనిత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రఖ్యాతి చెందిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాల ప్రదర్శన నగర ప్రజలకు విశేషంగా ఆకట్టుకుంటోందని వసుధ ఫ్యాషన్ లైఫ్ లైన్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ అన్నారు. స్థానిక జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన, విక్రయాలకు మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50 మందికి పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోలకతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నుంచి ప్రముఖ డిజైనర్ల వస్త్రాలను నగర ప్రజలకు పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన 15వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

3వ తేదీ వరకూ డ్రోన్ సర్వే

సీతానగరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండల రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే వచ్చే నెల 3వ తేదీ వరకూ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14 బొబ్బిల్లంక, మిర్తిపాడు, 15న నాగంపల్లి, 16న నాగంపల్లి, ఉండేశ్వరపురం, 17న జాలిమూడి, కాటవరం, 18న కాటవరం, 20న ముగ్గళ్ల, 21న నల్గొండ, 23, 24న చినకొండేపూడి, 25న చినకొండేపూడి, కూనవరం, 27, 28న రఘుదేవపురం, 29న రఘుదేవపురం, మునికూడలి, 31న, వచ్చేనెల 1న ములకల్లంక, 3న సీతానగరం రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే జరుగుతుందన్నారు. రైతులు తమ భూ సమస్యలు ఉంటే వారి పరిధిలోని వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు క్రీడాపరికరాల బహూకరణ

రంగంపేట: దొడ్డిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు క్రీడా పరికరాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ పదమూడో సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆశీస్సులతో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించామన్నారు.

మాజీ సర్పంచ్ చంద్రరావు మృతి

రాజానగరం: దివాన్ చెరువు మాజీ సర్పంచ్ కొవ్వాడ చంద్రరావు (62) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంటి వద్దనే కన్నుమూశారు. 2014లో జరిగిన పంచాయతీ ఎన్నికలో సర్పంచ్ పదవి ఎస్సీలకు కేటాయించడంతో వైఎస్సార్ సీపీ మద్దతుతో సర్పంచ్‌గా విజయం సాధించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు వంక మల్లిబాబు, గంగి బ్రహ్మరాజు, పంచాయతీ కార్యదర్శి సత్తిరాజు, తదితరులు ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రఘుదేవపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 890 మంది రోగులకు పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వైద్య సేవలు అందించారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ రిజి, ఏఎన్ఎంలు స్వరాజ్యం, లక్ష్మి, ఆశావర్కర్లు కుమారి, లలిత పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

పెదపూడి: పెదపూడి గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు చిర్ల సూర్యనారాయణరెడ్డి (ఫార్మసిస్ట్) తెలిపారు. కాకినాడ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ స్టార్స్ ఆధ్వర్యంలో కాకినాడలోని మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తన భార్య చిర్ల విజయలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ



జక్కంపూడి విజయలక్ష్మి సమక్షంలో బాధితులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

- ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

రాజమహేంద్రవరం సిటీ: పేదలను ఆదుకునేందుకు వైఎస్సార్ సీపీ నిరంతరం సిద్ధంగా ఉంటుందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం రాఘవపురం గ్రామానికి చెందిన పెనుగొండ దుర్గాప్రసాద్ నగరంలోని తిలక్ రోడ్డులో కొంతకాలంగా తాపీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తాపీపని చేస్తుండగా దురదృష్టవశాత్తూ కిందపడి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని జక్కంపూడి విజయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆమె సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని సూచించారు. ఆ కాంట్రాక్టర్ రూ.4.20 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. ఈ మేరకు సోమవారం చెక్కును బాధిత కుటుంబానికి జక్కంపూడి విజయలక్ష్మి సమక్షంలో కాంట్రాక్టరు అందజేశాడు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంత శ్రీహరి, ట్రేడ్ యూనియన్ నాయకుడు కర్రి లక్ష్మీనరసింహారెడ్డి (వాటర్ వర్క్స్ రెడ్డి), కొండపల్లి దుర్గారావు, కరుణామయుడు బోసు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు కొండపైన వెలసిన భ్రమరాంబ సమేత పంచలింగ మల్లికార్జునస్వామికి సోమవారం రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఆయన సతీమణి రాజశ్రీ చేతుల మీదుగా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ మండల బూత్‌కమిటీ కన్వీనర్ కల్యాణం రాంబాబు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేశారు. తొలుత ఎమ్మెల్యే రాజా, ఆయన సతీమణి.. రాంబాబు నివాసం నుంచి మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీలతో నడుచుకుంటూ స్వామివారి కొండెక్కారు. స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారికి విశేష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన ఎమ్మెల్యే రాజా దంపతులు నిర్వహించారు.

త్వరలో కొండపైకి రోడ్డు మార్గం

ఈ సందర్భంగా జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు కల్యాణం రాంబాబు తదితర నాయకులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించాలని నిర్ణయించుకున్నారన్నారు. స్వామివారి కృపాకటాక్షంతో ఎన్నికల్లో 32 వేల ఓట్లు మెజార్టీతో గెలుపొందానన్నారు. స్వామి వారికి మొక్కులో భాగంగా సతీసమేతంగా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వామివారి దయతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన జనరంజకంగా సాగుతోందన్నారు. స్వామివారి కొండపైకి రోడ్డు మార్గాన్ని త్వరలో పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. దీని కోసం రూ. 40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఖర్చువుతుందన్నారు. ఈ పనులు నిర్వహించడానికి కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నారన్నారు. కొండపైకి రోడ్డు నిర్మాణం విషయమై గతంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు, ఈ మేరకు సర్వే చేసి, అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌కు చెందిన ఉప్పులూరి సత్యనారాయణ ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.పది లక్షలను షెడ్ల నిర్మాణానికి కేటాయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల బూత్‌కమిటీ కన్వీనర్ కల్యాణం రాంబాబు, కణుపూరు సర్పంచ్ కరణం రమణ, నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, స్థానిక నాయకులు సంగాన రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలి

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. మండలంలో కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లోని మురుగు కాలువల్లో జేసీబీ సహాయంతో చేస్తున్న పూడిక పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులను ప్రతిరోజు సచివాలయం కార్యదర్శులు పరిశీలించాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు రక్షిత పథకాలను నిర్ణీత సమయంలో శుభ్రం చేసి క్లోరినేషన్ చేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ హోమం

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత భజేనారాయణస్వామి ఆలయంలో జరుగుతున్న 23వ శ్రీరామ అఖండ భజన సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం ఉదయం 9 గంటలకు అఖండ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు, శ్రీనివాసాచార్యులు హోమ కార్యక్రమాలు జరిపారు. ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు దంపతులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం భజన సమాజం ఆధ్వర్యంలో భజనలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, గుమస్తా హనుమంతు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.